# నమస్తే ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 349 | పేజీలు: 4 | వెల: రూ.4/- | సోమవారం 4 ఆగస్టు 2025 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## తల్లి బాగోగులు కుమారుడి బాధ్యత.. దాతృత్వం కాదు

### కేరళ హైకోర్టు వ్యాఖ్య

కోచి, ఆగస్టు 3 (నమస్తే ఉదయం): శతాధిక వృద్ధురాలైన తల్లికి పోషణ ఖర్చుల కింద నెలకు రూ.2 వేలు చెల్లించాలంటూ ఆమె కుమారుడిని ఆదేశిస్తూ ఫ్యామిలీ కోర్టు జారీ చేసిన ఆదేశాలను కేరళ హైకోర్టు సమర్థించింది. ఈ మేరకు 57 ఏండ్ల కుమారుడికి చీవాట్లు పెట్టింది. తల్లి బాగోగులు చూడకపోవడంపై సిగ్గుపడాలని జస్టిస్ పీవీ కున్హికృష్ణన్ వ్యాఖ్యానించారు. తల్లిని సంరక్షించడం ప్రతి కుమారుడి విధి అని, అది దాతృత్వం కాదని పేర్కొన్నారు. ఫ్యామిలీ కోర్టు తీర్పుకు వ్యతిరేకంగా పిటిషనర్ దాఖలు చేసిన అప్పీల్‌ను జడ్జి కొట్టివేశారు. శతాధిక వృద్ధురాలైన తల్లి నిర్వహణ ఖర్చుల కింద నెలకు రూ.5 వేలు కావాలని కోరడం, ఆమెకు అంత అవసరం లేదంటూ దానిని చెల్లించడానికి కొడుకు నిరాకరించడం, దానిపై కోర్టు కెక్కడం చూస్తుంటే ఈ సమాజంలోని సభ్యుడిగా తాను సిగ్గు పడుతున్నానని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు.

# ఎన్నికల సంఘం పిలుపు.. ఢిల్లీకి కేటీఆర్ బృందం



- ఆగస్టు 5న ఈసీఐ సమావేశానికి హాజరుకానున్న బీఆర్ఎస్
- కేటీఆర్ నేతృత్వంలో ఢిల్లీకి వెళ్లనున్న ప్రతినిధి బృందం
- ఎన్నికల సంస్కరణలు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌పై చర్చ
- బీఆర్ఎస్ పెండింగ్ వినతులపైనా చర్చించే అవకాశం
- ఓటర్ల జాబితా సవరణ వివాదం నేపథ్యంలో భేటీకి ప్రాధాన్యత



న్యూఢిల్లీ, ఆగస్టు 3 (నమస్తే ఉదయం)

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని ఒక ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ఢిల్లీ పర్యటనకు సిద్ధమైంది. కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) ఏర్పాటు చేసిన కీలక సమావేశంలో పాల్గొనేందుకు ఈ బృందం ఢిల్లీకి వెళ్లనుంది. రాజకీయ పార్టీలతో ఈసీఐ నిర్వహించనున్న ఈ భేటీ ఆగస్టు 5వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు ఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో జరగనుంది. ఈ సమావేశానికి హాజరుకావాల్సిందిగా బీఆర్ఎస్ పార్టీకి ఎన్నికల సంఘం కార్యదర్శి అశ్వనీ కుమార్ మోహల్ అధికారికంగా లేఖ పంపారు. తెలంగాణ ముఖ్య ఎన్నికల అధికారి ద్వారా కూడా బీఆర్ఎస్ అధ్యక్షుడికి సమాచారం అందించారు. కేటీఆర్ నాయకత్వంలోని ఈ బృందంలో పార్టీ సీనియర్ నేతలు, మాజీ పార్లమెంట్ ..మిగతా 2లో

# కొత్త రేషన్ కార్డుదారులకు గుడ్‌న్యూస్

### ప్రభుత్వ పథకాలు వర్తింపు, దరఖాస్తుల స్వీకరణకు ఏర్పాట్లు



హైదరాబాద్, ఆగస్టు 3 (నమస్తే ఉదయం)

కొత్త రేషన్‌కార్డులు పొందిన వారికి ఉచిత విద్యుత్తు, రాయితీపై గ్యాస్ సిలిండర్ తదితర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వర్తించనున్నాయి. పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా అవకాశం కల్పించింది. 10 ఏళ్లుగా రేషన్‌కార్డులు మంజూరు కాకపోవడంతో గత, ప్రస్తుత ప్రభుత్వంలో పలు పథకాలకు చాలా మంది అర్హులు దూరమయ్యారు. ప్రస్తుతం వారికి రేషన్‌కార్డులు మంజూరు చేయడంతో లబ్ధిదారుల్లో కొత్త ఆశలు చిగురించాయి. వీరితోపాటు గతంలో రేషన్ కార్డు కలిగి ఉండి పథకాలు పొందనివారు సైతం వాటికోసం దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుల స్వీకరణకు పురపాలక ఆఫీసులు, ఎంపీడీవో(మండల్ పరిషత్ డెవలప్‌మెంట్ ఆఫీసర్) కార్యాలయాల్లో స్పెషల్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. నారాయణపేట జిల్లావ్యాప్తంగా నూతనంగా 11,798 రేషన్‌కార్డులు అందజేయగా, అందులో నూతనంగా 23,701 మందికి అర్హులకు లబ్ధి చేకూరనుంది.

లబ్ధిదారుల్లో ఆశలు : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా రాష్ట్రంలో పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. వీటిలో ముఖ్యంగా మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500లకే వంటగ్యాస్, గృహజ్యోతిలో 200 యూనిట్లలోపు ఫ్రీ కరెంట్ లాంటి వాటికి రేషన్‌కార్డు తప్పనిసరి చేసింది. దీంతో కార్డులేని కుటుంబాలు పథకాలకు దూరమయ్యారు. ప్రభుత్వ నిర్ణయంతో ఈ సమస్య తీరనుంది.

దరఖాస్తు విధానం ఇలా : గ్రామీణ ప్రాంతాలకు ..మిగతా 2లో



## కవిత, జగదీశ్ రెడ్డి మధ్య
# మాటల తూటాలు!

- బీఆర్ఎస్‌లో తారాస్థాయికి చేరిన నేతల మధ్య విభేదాలు
- మాజీ మంత్రి జగదీశ్ రెడ్డిపై ఎమ్మెల్సీ కవిత తీవ్ర స్థాయిలో విమర్శలు
- జగదీశ్ రెడ్డి ఓ 'లిల్లిపుట్' అని, కేసీఆర్ లేకపోతే ఆయనెవరని వ్యాఖ్య
- తనపై కొందరు పార్టీ నేతలే కుట్ర చేస్తున్నారని కవిత ఆరోపణ
- కవిత వ్యాఖ్యలకు జగదీశ్ రెడ్డి ఘాటుగా బదులు, సెటైర్లు
- కేసీఆర్ శత్రువుల మాటలను కవిత వాడుతున్నారని జగదీశ్ రెడ్డి ఆరోపణ

2



## రాష్ట్రపతితో మోడీ, అమిత్ షా
# వరుస భేటీలు

న్యూఢిల్లీ, ఆగస్టు 3 (నమస్తే ఉదయం)

రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేపుతూ, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా గంటల వ్యవధిలో విడివిడిగా సమావేశమయ్యారు. ఆదివారం మధ్యాహ్నం మోడీ రాష్ట్రపతితో భేటీ కాగా, సాయంత్రం అమిత్ షా రాష్ట్రపతి భవన్‌లో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఒకే రోజున ప్రధాని, హోంమంత్రి రాష్ట్రపతితో భేటీ అవ్వడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ కీలక భేటీల్లో ఏయే అంశాలపై చర్చ జరిగిందనేది మాత్రం గోప్యంగా ఉంది. అయితే, ప్రస్తుతం జూలై 21న ప్రారంభమై ఆగస్టు 12 వరకు కొనసాగనున్న వర్షాకాల పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ భేటీలు జరిగాయి. ముఖ్యంగా, ఈ సమావేశాల్లో 'ఆపరేషన్ సింధూర్'పై కీలక చర్చలు జరుగుతున్న తరుణంలో, ప్రధాని, హోంమంత్రుల రాష్ట్రపతి భేటీ ప్రాధాన్యతను సంతరించుకుంది. సాధారణంగా, పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నప్పుడు ప్రభుత్వ కీలక నిర్ణయాలు, బిల్లులు లేదా జాతీయ ప్రాముఖ్యత కలిగిన అంశాలపై రాష్ట్రపతికి సమాచారం అందించడం జరుగుతుంది. అయితే, విడివిడిగా భేటీ అవ్వడం, చర్చనీయాంశమైన 'ఆపరేషన్ సింధూర్'పైనే ప్రధానంగా చర్చ జరిగి ఉండవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ భేటీల వెనుక ఉన్న అసలు కారణాలు, వాటి తక్షణ ప్రభావం ఏమిటన్నది వేచి చూడాలి.

## బనకచర్లను అడ్డుకునేందుకు
# ఎంతవరకైనా వెళతాం

### ఉత్తమ్ కుమార్ రెడ్డి

- గోదావరి-బనకచర్ల ప్రాజెక్టును చట్టపరంగా అడ్డుకుంటామన్న తెలంగాణ
- ఇది విభజన చట్టానికి విరుద్ధమంటున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- రాయలసీమకు నీటి తరలింపును సహించేది లేదని స్పష్టీకరణ
- అవసరమైతే సుప్రీంకోర్టును కూడా ఆశ్రయిస్తామని వెల్లడి
- గోదావరిపై కొత్త ప్రాజెక్టులతో హక్కులు కాపాడుకుంటామని హామీ



హైదరాబాద్, ఆగస్టు 3 (నమస్తే ఉదయం)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం కఠిన వైఖరి అవలంబిస్తోంది. ఈ ప్రాజెక్టును చట్టపరంగా అడ్డుకుని తీరుతామని, తెలంగాణ నీటి హక్కులను కాపాడేందుకు ఎంతవరకైనా వెళతామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ విభజన చట్టానికి పూర్తిగా విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. రామగుండం నియోజకవర్గంలో రామగుండం ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించిన సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. గోదావరి జలాలను రాయలసీమకు తరలించేందుకు ఉద్దేశించిన బనకచర్ల ప్రాజెక్టును తమ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని తెలిపారు. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణ ప్రయోజనాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని, దీనిని నిలువరించేందుకు అన్ని చట్టపరమైన మార్గాలను అనుసరిస్తామని ఆయన వివరించారు. ఇప్పటికే కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో ఈ విషయంపై చర్చించామని, అవసరమైతే సుప్రీంకోర్టును కూడా ఆశ్రయిస్తామని తేల్చిచెప్పారు. తెలంగాణ జల హక్కులను కాపాడటంలో తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉత్తమ్ కుమార్ రెడ్డి ..మిగతా 2లో

# కవిత, జగదీశ్ రెడ్డి మధ్య మాటల తూటాలు!

హైదరాబాద్, ఆగస్టు 3 (నమస్తే ఉదయం)

బీఆర్ఎస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డిపై పరోక్షంగా విరుచుకుపడ్డారు. జగదీశ్ రెడ్డిని 'లిల్లిపుట్' అంటూ సంబోధించిన కవిత, కేసీఆర్ నీడలో బతికే ఆయనకు సొంత అస్తిత్వం లేదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. దీనిపై జగదీశ్ రెడ్డి కూడా అంతే స్థాయిలో స్పందిస్తూ సెటైరికల్ కౌంటర్ ఇచ్చారు. ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడిన కవిత, తనపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేస్తున్న అనుచిత వ్యాఖ్యల వెనుక బీఆర్ఎస్‌లోని కొందరు ముఖ్య నేతల హస్తం ఉందని సంచలన ఆరోపణలు చేశారు. "పార్టీలోని ఒక అగ్రనేత ప్రోద్బలంతోనే నాపై ఇలాంటి వ్యాఖ్యలు చేయిస్తున్నారు. అందుకే బీఆర్ఎస్ నేతలు ఎవరూ దీనిపై మాట్లాడటం లేదు" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. జగదీశ్ రెడ్డిని ఉద్దేశిస్తూ, "కేసీఆర్ అనే నీడ లేకపోతే మీరెవరు? నల్గొండ జిల్లాలో పార్టీని నాశనం చేశారు. తర్వాత పార్టీలో చేరిన ఓ చిన్న నేత కూడా నా విశ్వసనీయతను ప్రశ్నించే స్థాయికి వచ్చారు" అని మండిపడ్డారు. తనను ఒంటరిని చేసి, పక్కన పెట్టాలని చూస్తున్నారని, అయితే కర్మ సిద్ధాంతాన్ని నమ్ముతానని, చేసిన వారికి తగిన ఫలితం దక్కుతుందని కవిత అన్నారు. కొద్ది నెలల క్రితం కేసీఆర్‌కు రాసిన లేఖ లీక్ అయిన నాటి నుంచి కవిత అసంతృప్తితో ఉన్న విషయం తెలిసిందే.



"కేసీఆర్ ఒక దేవుడు, కానీ ఆయన చుట్టూ రాక్షసులు చేరారు" అని ఆమె గతంలో చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా గుర్తుచేశారు.

**కవిత వ్యాఖ్యలపై జగదీశ్ రెడ్డి స్పందన**

కవిత చేసిన తీవ్ర వ్యాఖ్యలపై మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి కూడా ఎక్స్ వేదికగా ఘాటుగా స్పందించారు. "నా ఉద్యమ ప్రస్థానానికి సంబంధించి కవితమ్మకు ఉన్న జ్ఞానానికి నా జోహార్లు. కేసీఆర్ శత్రువులైన రేవంత్, రాధాకృష్ణ లాంటి వారు నా గురించి మాట్లాడిన మాటల్ని ఆమె మరొక్కసారి వల్లె వేసేందుకు చేసిన ప్రయత్నానికి నా సానుభూతిని తెలియజేస్తున్నా" అంటూ ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు.



## బనకచర్లను అడ్డుకునేందుకు
# ఎంతవరకైనా వెళతాం

మొదటి పేజీ తరువాయి...

పునరుద్ఘాటించారు. గోదావరి నదిపై ఇచ్చంపల్లితో పాటు ఇతర కొత్త ప్రాజెక్టులను నిర్మించి, గోదావరి బేసిన్‌లోని ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందుకు వెళితే, దానిని కచ్చితంగా అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ ప్రాజెక్టుపై పూర్తి వివరాలతో ఈ నెల 30న ప్రజాభవన్‌లో ఒక ప్రజెంటేషన్ ఇవ్వనున్నట్లు మంత్రి వెల్లడించారు.



## కేసీఆర్ వల్లే ఏపీ ప్రభుత్వం
# బనకచర్ల ప్రాజెక్టు చేపట్టింది

**టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**

**టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ సంచలన ఆరోపణ**

**రాయలసీమను రతనాల సీమ చేస్తానన్న కేసీఆర్‌ను గుర్తుచేసిన వైనం**

**తెలంగాణ ప్రయోజనాలను కేసీఆర్ విస్మరించారని తీవ్ర విమర్శ**

**నిజామాబాద్ జిల్లా కార్యకర్తల సమావేశంలో వ్యాఖ్యలు**

హైదరాబాద్, ఆగస్టు 3 (నమస్తే ఉదయం)

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వల్లే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. తెలంగాణ ప్రయోజనాలను పణంగా పెట్టి, పొరుగు రాష్ట్రానికి లబ్ధి చేకూర్చేలా కేసీఆర్ వ్యవహరించారని ఆయన తీవ్రంగా విమర్శించారు.

"గోదావరిలో 3 వేల టీఎంసీల మిగులు జలాలు ఉన్నాయి, వాటిని ఏపీ వాడుకోవచ్చు" అని గతంలో కేసీఆరే స్వయంగా చెప్పారని గుర్తుచేశారు. తెలంగాణను పక్కనపెట్టి, రాయలసీమను రతనాల సీమగా మారుస్తానని కేసీఆర్ హామీ ఇచ్చారని, ఆయన మాటలతోనే ఏపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు విషయంలో ముందుకు వెళ్లిందని స్పష్టం చేశారు. ప్రస్తుతం తమ ప్రభుత్వంపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

నిజామాబాద్ జిల్లాలో చేపట్టిన జనహిత పాదయాత్రలో భాగంగా జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ గ్రామంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో మహేశ్‌కుమార్ గౌడ్ ఈ వ్యాఖ్యలు చేశారు.

## ఎన్నికల సంఘం పిలుపు..
# ఢిల్లీకి కేటీఆర్ బృందం

మొదటి పేజీ తరువాయి...




సభ్యులు ఉండనున్నారు. రాజ్యసభలో బీఆర్ఎస్ పక్ష నేత కేఆర్ సురేశ్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీలు బోయినపల్లి వినోద్ కుమార్, బాల్క సుమన్, పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఈ బృందంలో సభ్యులుగా ఉన్నారు.

ఈ సమావేశంలో ప్రధానంగా ఎన్నికల సంస్కరణలు, వివిధ పార్టీలు సమర్పించిన వినతులు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) వంటి కీలక అంశాలపై చర్చ జరగనుంది. బీఆర్ఎస్ పార్టీ గతంలో ఇచ్చిన వినతులు కూడా చర్చకు వచ్చే అవకాశం ఉంది.

దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో రాబోయే ఎన్నికల నేపథ్యంలో ఈ సమావేశానికి రాజకీయంగా ప్రాధాన్యత ఏర్పడింది. ముఖ్యంగా బిహార్‌తో పాటు ఇతర రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ – ఎస్ఐఆర్) డ్రైవ్‌పై వివాదం నడుస్తున్న తరుణంలో ఈ భేటీ జరగడం గమనార్హం. ఇదే అంశంపై కాంగ్రెస్ సహా ఇతర విపక్షాలు పార్లమెంటు ఉభయ సభలను స్తంభింపజేస్తూ, చర్చకు పట్టుబడుతున్నాయి. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా ఈ వ్యవహారంపై ఆగస్టు 5న బెంగళూరులో నిరసన చేపట్టనున్నారు. ఈ రాజకీయ పరిణామాల మధ్య బీఆర్ఎస్ బృందం ఈసీఐ సమావేశానికి హాజరుకావడం ఆసక్తికరంగా మారింది.

## కొత్త రేషన్ కార్డుదారులకు
# గుడ్‌న్యూస్

మొదటి పేజీ తరువాయి...

సంబంధించిన మండల పరిషత్తు కార్యాలయాల్లో(ఎంపీడీవో ఆఫీస్), పట్టణాల్లోని లబ్ధిదారులు మున్సిపల్ కార్యాలయాల్లో సంప్రదించాల్సి ఉంటుంది. రాయితీ గ్యాస్ కోసం లబ్ధిదారులు తమ ఆధార్‌కార్డు, తెల్లరేషన్ కార్డు జిరాక్స్‌లతో పాటు గ్యాస్ కనెక్షన్ ధ్రువీకరణ పత్రాలు కౌంటర్లతో సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తు సంఖ్యను ప్రజా పరిపాలనలో కలిగి ఉండాలి. అప్పుడు మాత్రమే వారు పథకాలకు అర్హత పొందుతారు. కాగా ప్రస్తుతం వెబ్‌సైట్‌లో రాయితీ వంటగ్యాస్ ఆప్షన్ ఓపెన్ కావడంలేదని గృహజ్యోతి పథకం ఆప్షన్ మాత్రమే సెలక్ట్ అవుతుందని అధికారులు చెబుతున్నారు.

నిరంతయ ప్రక్రియ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను అమలుకు చేసేందుకు గాను మున్సిపల్ ఆఫీసుల్లో ప్రత్యేక ప్రజాపాలన కౌంటర్‌ను ఏర్పాటు చేశామని నారాయణ పేట పురపాలక సంఘం కమిషనర్ భోగేశ్వర్లు తెలిపారు. నూతనంగా రేషన్‌కార్డులు తీసుకున్నవారు మున్సిపల్ ఆఫీసుల్లో ప్రభుత్వం కల్పించిన సంక్షేమ పథకాలకు గతంలో దరఖాస్తు చేసుకోనివారు దరఖాస్తు చేసుకోవాలని కోరుతున్నాం. ప్రజాపాలన సేవాకేంద్రం నిరంతర ప్రక్రియ. ప్రజలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పుర కమిషనర్ భోగేశ్వర్లు కోరారు.

3.10కోట్ల మంది రేషన్ ఉపయోగించుకుంటున్నారు : రాష్ట్రంలో రేషన్ కార్డు కింద సన్నబియ్యం ఇవ్వడం వల్లనే రేషన్‌కార్డులకు డిమాండ్ పెరిగిందని సీఎం రేవంత్ రెడ్డి కొద్ది రోజుల క్రితం తెలిపారు. ఇప్పటివరకు 7లక్షలకు పైగా కొత్త రేషన్‌కార్డులు ఇచ్చినట్లుగా చెప్పారు. తెలంగాణలో 96.95లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని రేవంత్ రెడ్డి వివరించారు. 3.10కోట్ల మంది రేషన్ ఉపయోగించుకుంటున్నారని పేర్కొన్నారు. రేషన్ కార్డుల పంపిణీని కూడా ఆయన ఇప్పటికే ప్రారంభించారు. రేషన్ కార్డుదారులకు ప్రభుత్వ పథకాలు కూడా వర్తింపజేస్తుండటంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి.



## యూపీలో
# ఘోర ప్రమాదం

న్యూఢిల్లీ, ఆగస్టు 3 (నమస్తే ఉదయం)


ఉత్తరప్రదేశ్‌లో ఆదివారం నాడు ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. భక్తులతో వెళుతున్న ఒక వాహనం అదుపుతప్పి కాలువలో పడటంతో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ హృదయ విదారక ఘటన గోండా జిల్లాలో జరిగింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ ప్రమాదంలో మరో నలుగురు గాయపడ్డారు.

మోతిగంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిహగావ్ గ్రామానికి చెందిన 14 మంది ఒక బొలెరో వాహనంలో ఖర్గుపూర్‌లోని పృథ్వీనాథ్ ఆలయానికి పూజల కోసం బయలుదేరారు. మార్గమధ్యంలో వీరి వాహనం సరయూ కాలువలోకి దూసుకెళ్లింది. వాహనం నీటిలో మునిగిపోవడాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. కొందరు గ్రామ పెద్దకు విషయం చేరవేశారు.

సమాచారం అందుకున్న ఇటియాథోక్ పోలీసులు, స్థానికులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. నీటిలో మునిగిపోయిన వాహనం నుంచి మృతదేహాలను వెలికితీశారు. మృతులలో పురుషులు, మహిళలు, చిన్నారులు కూడా ఉన్నారు. ఈ దుర్ఘటనపై జిల్లా ఎస్పీ వినీత్ జైస్వాల్ మాట్లాడుతూ, "ఆలయానికి వెళుతుండగా బొలెరో వాహనం కాలువలో పడిపోవడంతో 11 మంది మరణించారు. స్వల్ప గాయాలతో బయటపడిన నలుగురిని రక్షించి జిల్లా ఆసుపత్రికి తరలించాం" అని తెలిపారు.

ఈ ప్రమాదంపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు తలా రూ. 5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన 'ఎక్స్' వేదికగా వెల్లడించారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా ఈ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి (పీఎంఎన్ఆర్ఎఫ్) నుంచి మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున పరిహారం అందిస్తామని ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) ఒక ప్రకటనలో తెలిపింది. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.



## ఆర్టీసీ ఉద్యోగి ఈగ పూరి ప్రభాకర్ రెడ్డి
# పదవి విరమణ

కొత్తకోట, ఆగస్టు3(నమస్తే ఉదయం) కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన ఆర్టీసీ ఉద్యోగి ఈగపూరి ప్రభాకర్ రెడ్డి పదవి విరమణ కార్యక్రమం ఆర్కే కన్వెన్షన్ లో జరిగింది. ఈ కార్యక్రమానికి పలువురు నాయకులు, అధికారులు హాజరై ప్రభాకర్ రెడ్డి ని సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు .ఉమ్మడి పాలమూరు జిల్లా సిడిసి మాజీ చైర్మన్ బీసం చెన్నకేశవరెడ్డి , బిఆర్ఎస్ పార్టీ ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి గాడిల ప్రశాంత్, బిఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షులు పసుపుల నెహ్రూ, కొత్తకోట టౌన్ ఎస్సీ సెల్ అధ్యక్షులు మంద ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

## అతి త్వరలో
# భారత్‌లో బుల్లెట్ రైలు

**2 గంటల్లోనే ముంబై నుంచి అహ్మదాబాద్ కు!**

**ముంబై-అహ్మదాబాద్ మధ్య బుల్లెట్ రైలు సేవలు అతి త్వరలో ప్రారంభం**

**కేవలం 2 గంటల 7 నిమిషాలకు తగ్గనున్న ప్రయాణ సమయం**

**గంటకు 320 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించనున్న రైలు**

**వేగంగా సాగుతున్న 508 కిలోమీటర్ల హై-స్పీడ్ రైల్ కారిడార్ పనులు**

న్యూఢిల్లీ, ఆగస్టు 3 (నమస్తే ఉదయం)

దేశ ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న బుల్లెట్ రైలు ప్రాజెక్ట్‌పై కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కీలక ప్రకటన చేశారు. ముంబై–అహ్మదాబాద్ మధ్య దేశంలోని మొట్టమొదటి బుల్లెట్ రైలు సేవలను అతి త్వరలోనే ప్రారంభిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ రైలు అందుబాటులోకి వస్తే, ఈ రెండు నగరాల మధ్య ప్రయాణ సమయం కేవలం 2 గంటల 7 నిమిషాలకు తగ్గిపోతుందని తెలిపారు.

ఆయన ఇవాళ అయోధ్య ఎక్స్‌ప్రెస్, రేవా–పుణె ఎక్స్‌ప్రెస్, జబల్‌పూర్–రాయ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, బుల్లెట్ రైలు ప్రాజెక్ట్ పనులు చాలా వేగంగా జరుగుతున్నాయని వివరించారు. ఈ రైలు గంటకు 320 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుందని పేర్కొన్నారు. ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్ నుంచి గుజరాత్‌లోని వాపి, సూరత్, వడోదర, అహ్మదాబాద్ వంటి ప్రధాన నగరాలను కలుపుతూ 508 కిలోమీటర్ల పొడవైన హై–స్పీడ్ రైల్ కారిడార్ నిర్మాణం జరుగుతోందని ఆయన తెలిపారు.

గుజరాత్‌లో చేపట్టనున్న మరిన్ని రైల్వే ప్రాజెక్టుల గురించి కూడా అశ్విని వైష్ణవ్ ప్రస్తావించారు. పోర్‌బందర్–రాజ్‌కోట్ మధ్య కొత్త రైలు, రణవావ్ స్టేషన్‌లో రూ.135 కోట్లతో కోచ్ మెయింటెనెన్స్ కేంద్రం, పోర్‌బందర్‌లో రైల్వే ఫ్లైఓవర్, రెండు గతి శక్తి కార్గో టెర్మినళ్లు వంటివి రానున్నాయని వెల్లడించారు. గత 11 ఏళ్లలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా 34,000 కిలోమీటర్ల మేర కొత్త రైల్వే ట్రాకులు వేశామని, ఇది రోజుకు సగటున 12 కిలోమీటర్లతో సమానమని ఆయన గుర్తుచేశారు. రైళ్ల రాకపోకలను నిలిపివేయకుండానే 1,300 రైల్వే స్టేషన్లను ఆధునీకరించడం భారత రైల్వే చరిత్రలో అపూర్వమైన ఘట్టమని కొనియాడారు.

వందే భారత్, అమృత్ భారత్, నమో భారత్ వంటి ఆధునిక రైళ్లను ప్రవేశపెట్టామని, తక్కువ ధర టిక్కెట్లతో అత్యాధునిక సౌకర్యాలున్న 8 అమృత్ భారత్ రైళ్లకు ప్రయాణికుల నుంచి అద్భుతమైన స్పందన వస్తోందని ఆయన అన్నారు. గుజరాత్‌తో పాటు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో కూడా డబుల్ ఇంజన్ ప్రభుత్వాల సహకారంతో రైల్వే ప్రాజెక్టులు వేగంగా ముందుకు సాగుతున్నాయని అశ్విని వైష్ణవ్ వివరించారు.

# శివరాంపల్లిలో అ'పూర్వ' సమ్మేళనం

## మూడు దశాబ్దాల తర్వాత కలుసుకున్న చిన్న నాటి స్నేహితులు




1994. 95 వ విద్యా సంవత్సరంలో శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు, వారికి విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులు



ఉపాధ్యాయులకు సన్మానం

బుద్వేల్, ఆగస్టు 3 (నమస్తే ఉదయం): శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994-95 బ్యాచ్ కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది . ఈ సమ్మేళనానికి శివరాంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదిక అయింది. చిన్నప్పుడు కలసి చదువుకుని నేడు వివిధ విభాగాల్లో పని చేస్తున్న వారంతా కుటుంబ సమేతంగా తరలివచ్చారు.

### గుర్తుకొస్తున్నాయా.!

30 ఏళ్ల క్రితం హైస్కూల్ విద్యార్థులు ఇప్పుడు వారి పిల్లలు పదో తరగతి,ఇంటర్మీడియట్, పై చదువులు చదువుతున్నారు.ఆ రోజుల్లో కలిసి ఉండే కొంతమంది స్నేహితులు మినహా మిగతా వారెవరు ఒకరినొకరు పలకరించుకునే పరిస్థితులు ఉండేవి కాదు.ఇప్పుడు



మెమెంటోలతో.....

ఆకస్మత్తుగా కలుసుకోవడం వారిలో ఆశ్చర్యాన్ని ఆనందాన్ని కలుగజేసింది.ఆప్యాయంగా పలకరించుకున్నారు.'ఒరేయ్ ...నన్ను గుర్తుపట్టావా.? నేను నీ ఫ్రెండ్ రా అంటూ ఫ్లాష్ బ్యాక్ లోకి వెళ్ళిపోయారు.ఇలా ప్రతి ఒక్కరూ పూర్వ మిత్రులతో కలిసి ముచ్చటించుకున్నారు.గత అనుభూతులను నెమరు వేసుకున్నారు.మధుర స్మృతులు,తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.పూర్వ విద్యార్థులు చిన్ననాటి చిలిపి పనులు,మధుర జ్ఞాపకాలను నెమరేసుకున్నారు.ప్రస్తుతం వారు స్థిరపడ్డ రంగాలు,అనుభవాలను మిత్రులతో పంచుకున్నారు.తోటి మిత్రులనున ఆత్మీయంగా పలకరించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులుపుల్లారెడ్డి,ఈశ్వరయ్య,ఆర్.సరళ,కిషన్ నాయక్,విజయ్ కుమార్,నరసింహచారి,విద్యా కమిటీ చైర్మన్ పడమటి శ్రీధర్ రెడ్డి,లను పూర్వ విద్యార్థులు మెమోటోలతో ఘనంగా సత్కరించి సన్మానం చేసి వారి ఆశీర్వాదం పొందారు.అనంతరం నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ నాలుగు పదుల వయస్సులోనే చిన్నపిల్లలుగా ఆడిపాడి పండగ చేసుకున్నారు.ఈ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు



ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కు పుష్పగుచ్చం అందజేస్తున్న నూతన డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి

# రాజేంద్రనగర్ డిప్యూటీ కమిషనర్‌గా బి సురేందర్ రెడ్డి

## ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన రాజేంద్రనగర్ సర్కిల్ నూతన డీసీ సురేందర్ రెడ్డి

రాజేంద్రనగర్,ఆగస్టు03(నమస్తే ఉదయం) జిహెచ్ఎంసి రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీగా నూతన కమిషనర్ బి సురేందర్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు మెహదీపట్నం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ గా పనిచేస్తున్న బి సురేందర్ రెడ్డి కి రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ గా అదనపు బాధ్యతలను ఇస్తూ జిహెచ్ఎంసి కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివారం డిప్యూటీ కమిషనర్ గా బదిలీపై వచ్చిన సురేందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా రాజేంద్రనగర్ శాసనసభ్యులు టి.ప్రకాష్ గౌడ్ ను మైలార్ దేవుపల్లిలోని ఆయన స్వగృహంలో కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సన్మానించారు.అనంతరం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ... సర్కిల్ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి బాధ్యతాయుతంగా పరిచేయాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయతో సర్కిల్లో అభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తానని నూతన డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి అన్నారు.



కావడి యాత్రలో పాల్గొన్న నాయకులు

# శ్రావణ మాసంలో రాజస్తాన్ సేవా సమితి అధ్వర్యంలో కావడి యాత్ర



బుద్వేల్, ఆగస్టు 3 (నమస్తే ఉదయం): శ్రావణ ఆధివారం రోజున అత్తాపూర్ తేజస్వీనీ నగర్ కాలనీలో గల లక్ష్మీనర్సింహ్మా స్వామీ దేవాలయం నుంచి రాంబాగ్ చిన్న అనంతగిరి శివాలయం వరకు రాజస్థాన్ సేవా సమితి ఆధ్వర్యంలో కావడి యాత్ర నిర్వహించారు. పిల్ల పాపలతో కలసి రాజస్థాన్ ప్రాంతానికి చెందిన కుటుంబాలు పెద్ద సంఖ్యలో ఈ కావడి యాత్రలో పాల్గొన్నారు. రాంబాగ్ చిన్న అనంతగిరి శివాలయంలో బోళా శంకరున్ని దర్శించుకున్నారు. శివుడి ఆజ్ఞ లేనిదే సృష్టిలో ఏది కూడా జరుగదని తెలిపారు. ప్రతి పాణికి అహారంతో పాటు అన్ని రకాల వసతులను కల్పించేది శివుడే అని గుర్తు చేశారు. భజన కీర్తనలు. ఆట పాటలతో కావడి యాత్ర కొనసాగింది. కాపడి యాత్రంలో వందల సంఖ్యలో రాజస్తాన్ సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ యాత్రలో స్థానిక నాయకులు వనం శ్రీరాంరెడ్డి, ఎం.బాలసు బ్రమణ్యం, రాజేంద్ర అగర్వాల్, రమావత్ గుప్తా, వీవీఎస్ఆర్ ఆంజనేయులు, అశోక్ శర్మ, మూల్ చంద్ శర్మ, మనీశ్ శీతల్వాలా, మనీష్ అగర్వాల్, లాల్ చంద్ ఆగర్వాల్, రాజేశ్ సాబూ, అశోక్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



స్నేహితుల దినోత్సవం సందర్భంగా రాజేంద్రనగర్ సర్కిల్ గగన్పహడ్ కు చెందిన శీలం తిరుపతిరెడ్డి తో పాటు ఆయన స్నేహితులందరు ఒకే చోట సమావేశమై ఫ్రెండ్ప్ బ్యాన్ లను కట్టుకున్నారు. ఒకరికొకరు స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసుకుని సంతోషంగా గడి పారు. స్నేహమేరా జీవితం.. స్నేహిమేరా శాశ్వతం అంటు పాటలు పాడుకున్నారు.

- బుద్వేల్, నమస్తే ఉదయం

# సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యునిగా కన్యగారి నర్సింహ్మారెడ్డి



బుద్వేల్, ఆగస్టు 3 (నమస్తే ఉదయం): సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యునిగా బుద్వేల్ బృందావన్ కాలనీ నివాసి, సీపీఐ రాజేంద్రనగర్ మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మరెడ్డి నియమితులైనారు. ఆదివారం చేవెళ్ల నియోజకవర్గం మొయినాబాద్ లో జరిగిన సీపీఐ రంగారెడ్డి జిల్లా 17వ మహసభలలో కన్యగారి నర్సింహ్మరెడ్డి ని సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యునిగా నియమించారు. కన్యగారి నర్సింహ్మరెడ్డి మాట్లాడుతూ, రంగారెడ్డి జిల్లాలో సీపీఐ పార్టీని బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. తనను జిల్లా కార్యవర్గ సభ్యునిగా నియమించడంలో సహకరించిన పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, పార్టీ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు పుస్తకాల నర్సిరేవు. పానుగంటి పర్వతాలు కు ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు.

# ఉప్పర్పల్లి వద్ద కారు బోల్తా




బుద్వేల్, ఆగస్టు 3 (నమస్తే ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ పిల్లర్ నెంబర్ 174 ఉప్పర్పల్లి వద్ద ఆదివారం మద్యాహ్నం టీఎస్ 07 హెచ్పీ 5004 నెంబర్ కారు డీ వైడర్ ను ఢీ కొట్టి బోల్తా పడింది. కారులో ముగ్గురు బాలురు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. కారు ముందు బాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. సంఘటనా స్థలానికి చేరుకున్న రాజేంద్రనగర్ పోలీసులు వివరాలు సేకరించి కారు ను రోడ్డు మద్యలోనుంచి తొలగించారు.




మాట్లాడుతున్న సుంకర రామ్మోహన్

# భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల సంఘం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా సుంకర రామ్మోహన్

బుద్వేల్, ఆగస్టు 3 (నమస్తే ఉదయం) : భవన నిర్మాణ, ఇతర నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేస్తానని రంగారెడ్డి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి సుంకర రామ్మోహన్ తెలిపారు. శనివారం రంగారెడ్డి జిల్లా అమనగల్లు లో జరిగిన బవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా 4వ మహసభలలో రామ్మోహన్ ప్రధాన కార్యదర్శిగా నియమితులైనారు. ఆయన జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులు కావడం ఇది రెండో సారి, నిర్మాణ రంగ కార్మికులకు ప్రభుత్వ పరంగా రావాల్సిన అన్ని సౌకర్యాల సాధన కోసం పోరాడుతానన్నారు. తనపై నమ్మకం ఉంచి భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల సంఘం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించిన ప్రతి ఒక్కరికి దన్యవాదాలు తెలుపుతున్నానన్నారు.



పాలకుర్తి ఎమ్మెల్యే ను సన్మానిస్తున్న దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు

# పాలకుర్తి ఎమ్మెల్యే ను సన్మానించిన దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు

జనగామ, ఆగష్టు 03 (నమస్తే ఉదయం): జిల్లా లోని పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి స్వంత గ్రామం నియోజక వర్గంలోని తొర్రూరు మండలం,చర్లపాలెంలో వారు నూతనంగా నిర్మిస్తున్న స్వగృహ నిర్మాణానికి టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రాజేందర్ రెడ్డి దంపతులతో కలిసి భూమి పూజ కార్యక్రమంలో దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. వారి స్వగృహ నిర్మాణ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొని ఎమ్మెల్యే ని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు బోనగిరి యాకస్వామి, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు, మాజీ ఎంపిటిసి మమ్మద్ జాకీర్. కడబోయిన వెంకన్న. దౌపాటి రవి, సీతారాంపురం గ్రామ పార్టీ అధ్యక్షుడు రతన్ పటేల్. దౌపాటి నర్సయ్య, రామచంద్రు నాయక్, పాండు కృష్ణ. చింత నిఖిల్. గంగరాజు.తదితరులు పాల్గొన్నారు.

# విలువైనది... వెలకట్టనిది స్నేహం: శీలం తిరుపతిరెడ్డి

## గగన్ పహాడ్‌లో ఘనంగా స్నేహితుల దినోత్సవం

రాజేంద్రనగర్,ఆగస్టు03 (నమస్తే ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం యువకులు ఘనంగా నిర్వహించుకున్నారు.మిత్రులు అంతా ఒకచోట కలిసి కేక్ లు కట్ చేసి తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.ఈ సందర్భంగా ఆనందోత్సహాలతో వేడుకలు జరుపుకున్నారు.ఒకరికొకరు పరస్పరం చేతులకు ఫ్రెండ్ షిప్ డే గుర్తుగా బ్యాండ్లను కట్టుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ...స్నేహానికి ఉన్న గొప్పతనాన్ని పేర్కొన్నారు.స్నేహం విలువైనది,వెల కట్టలేనిది, స్నేహానికి మించిన అదృష్టం మరోటి లేదన్నారు.నిస్వార్ధంగా సహాయం అందించే వారే నిజమైన స్నేహితులని తెలిపారు.స్నేహానికన్నా లోకాన లేదు మిన్న అని కొనియాడారు.స్నేహబంధం ఎంతో విలువైనదనీ,మంచి స్నేహితులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని,ఒక్కసారి స్నేహం వీడితే మళ్లీ బలపడటం కష్టమని



పేర్కొన్నారు.తమ కష్టసుఖాలను పంచుకొనే స్నేహితుడు ఉన్నప్పుడు మనలో ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు.స్నేహితుడు ఇచ్చిన ధైర్యంతో ఉన్నత శిఖరాలకు ఎదిగిన వారు ఎందరో ఉన్నారన్నారు.స్నేహంలో చిన్న చిన్న మనస్పర్థలు వచ్చినా సర్దుకుపోవాలన్నారు.ఈ కార్యక్రమంలో శీలం తిరుపతిరెడ్డి,ఔరాడి రమేష్ ముదిరాజ్,సరికొండ వెంకటేష్,సూరెడ్డి కరుణాకర్ రెడ్డి,శీలం జగన్మోహన్ రెడ్డి,మాడపాటి కిషోర్ కుమార్,స్టార్ వెంకట్ రెడ్డి,పట్లోళ్ల శ్రీధర్ రెడ్డి,ఎనుముల ధనంజయరెడ్డి,అమ్రేష్,సూరెడ్డి సాయికృష్ణారెడ్డి,మోహన్ రెడ్డి,దేవేందర్ రెడ్డి,మమ్మద్ ఇబ్రహీంఖాన్,చిట్టి మురళి,అజయ్ ముదిరాజ్,తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాలు అభివృద్ధి

### నాగర్ కర్నూల్

### మాజీ ఎంపీ పోతుగంటి రాములు

గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 3 (నమస్తే ఉదయం) కేంద్ర ప్రభుత్వ నిధులతో నే గ్రామాలు అభివృద్ధి అర్థమవుతుందని నాగర్ కర్నూల్ మాజీ ఎంపీ పోతుగంటి రాములు అన్నారు. ఆదివారం గృహ మహా సంపర్క్ అభియాన్ లో భాగంగా రాష్ట్రపార్టీ ఆదేశాలమేరకు పాలమూరు ఎంపీ డీకే అరుణమ్మ సూచన ప్రకారం జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండల కేంద్రంలో బిజెపి మండల అధ్యక్షులు కే శశి కుమార్ రాజోలి మండల కేంద్రంలో రాజోలి గ్రామంలో వివర్స్ కాలనీలో ప్రతి ఇంటికి తిరిగి ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో సాధించిన ప్రగతిని చేపట్టిన అభివృద్ధి పనులను పథకాలను పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న నాగర్ కర్నూల్ మాజీ పార్లమెంట్ సభ్యుడు పోతుగంటి రాములు మాట్లాడుతూ...ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాలనలో సాధించిన విజయాలు ఘనతలపై చారిత్రక నిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు.అందులో భాగంగా ఆర్టికల్ 370, ట్రిపుల్ తలాక్,రామ మందిరం, స్టజికల్ స్ట్రైక్, ఆపరేషన్ సింధూర్, కరోనా వ్యాక్సిన్, ఉచిత బియ్యం, సిసి రోడ్, డ్రైనేజీలు, టాయిలెట్స్, అంగన్వాడికి ఇచ్చే నిధులు, ముద్ర లోన్స్, విశ్వకర్మ లోన్స్, రైతు వేదికలు,





వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాలు, పీఎం కిసాన్, దేశ భద్రత విషయంలో రాజీలేని,పోరాటం చేస్తుందన్నారు. కేంద్రం ప్రభుత్వం చేస్తున్న పనులను ప్రజలకు వివరించడం జరిగిందన్నారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలు ఇచ్చి ప్రజలకు మభ్య పెట్టాలని చూస్తుంది ఏ పథకం అమలు కావడం లేదు స్థానిక ఎన్నికలు కాంగ్రెస్కు బుద్ధి చెప్పాలని అలాగే స్థానిక బిజెపి అభ్యర్థులను జడ్పిటిసి ఎంపిటిసి గెలిపించాలని ఓటర్లను కోరారు. జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్ ఎస్ రామచంద్ర రెడ్డి మాట్లాడుతూ... ఈనెల 3, 4 ,5 ఈ మూడు రోజులు బూత్ అధ్యక్షులు, మండల నాయకులు ,జిల్లా, నాయకులు రాష్ట్ర నాయకులు ప్రతి ఒక్కరూ పోలింగ్ బూత్ ఎంచుకొని 100 ఇండ్లు తగ్గకుండా గృహ మహా సంపర్క్ అభియాన్ భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వాలు పథకాలు వివరించి అలాగే ,కాంగ్రెస్ వైఫల్యాల ఎండగాడుతూ ,బిఆర్ఎస్ అవినీతి గురించి, ప్రజలకు చెప్పి స్థానిక సంస్థలు బిజెపి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు అలంపూర్ కంటెస్టెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి రాజగోపాల్ ,సంజీవరెడ్డి,నాగేశ్వర్ రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్ శర్మ, మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ ,భగత్ రెడ్డి, నాగరాజ్ నరసింహులు, గోవిందరాజులు, తిరుపతి, రమేష్, బాబు, భీమన్న, గట్టు రాము, చిన్నప్ప వీరేష్, మహేష్ ,కురువ మహేష్, మద్దిలేటి రాము ,కొంకతి రాము,నరసింహులు ,విజయ్, ఉప్పల శంకర్, తదితరులు పాల్గొన్నారు.



# చిన్నారి అనికను ఆశీర్వదించిన మాజీ రాజ్యసభ సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి

కొత్తకోట, ఆగస్టు 3(నమస్తే ఉదయం) వనపర్తి మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గుంద్రాతి వామన్ గౌడు , గుంద్రాతి సుమిత్ర దంపతుల మనవరాలు బేబీ అనిక శారీ ఫంక్షన్ హైదరాబాద్ వన్ కన్వెన్షన్ సాగర్ రోడ్డు ఎల్బీనగర్ లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ రాజ్యసభ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్ రెడ్డి హాజరై బేబీ ఆనికను అక్షింతలు వేసి ఆశీర్వదించారు, ఈ కార్యక్రమంలో కొత్తకోట మాజీ జెడ్పిటిసి సభ్యులు పి. విశ్వేశ్వర్ , బి ఆర్ ఎస్ నాయకులు మూలమల్ల యుగంధర్ రెడ్డి, పోతులపల్లి యాదయ్య సాగర్, కృష్ణ గౌడ్, నరొత్తమ రెడ్డి తదితరులు చిన్నారిని ఆశీర్వదించిన వారిలో ఉన్నారు.




# భగవంతుని శరణాగతితోనే మానవ జీవితం

### ప్రతి మానవుడు భగవంతుని శరణాగతి తోనే ముక్తి మార్గం

### శ్రీ త్రిదండి దేవనాథ జీయర్ స్వామి

మల్దకల్,ఆగస్ట్ 03 (నమస్తే ఉదయం) అమరవాయి గ్రామంలో ఆదివారం వికాస తరంగిణి సభ్యులు వెంకటేశ్వర రెడ్డి గృహంలో వెంకట్ రామ్ రెడ్డి పరమావధి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జీయర్ స్వామికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వెంకటేశ్వర రెడ్డి కుటుంబాన్ని స్వామీజీ ఆశీర్వదించారు. ఈ సందర్భంగా శ్రీమన్నారాయణ పూజలను నిర్వహించి భక్తులను ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని అన్నారు. భగవంతుని చేరడానికి నాలుగు మార్గాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర రెడ్డి కుటుంబ సభ్యులతో పాటు కృష్ణారెడ్డి, భక్తులు, వికాస తరంగిణి సభ్యులు పాల్గొన్నారు.

# పురుగుల అన్నం పెడుతున్నారని విద్యార్థినుల ఆందోళన



గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 3(నమస్తే ఉదయం)గద్వాలలోని భీంనగర్ లో గల బీసీ బాలికల వసతీగృహం నందు తమకు పురుగుల అన్నం పెడుతున్నారని ఆదివారం హాస్టల్ ముందు విద్యార్థినిలు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. గత కొన్ని రోజులుగా అన్నంలో పురుగులు వస్తున్నాయని, ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థినీల ఆందోళనకు ఏబివిపీ నాయకులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఏబివీపీ నాయకులు మాట్లాడుతూ...విద్యార్థులకు కనీసం నాణ్యమైన భోజనం అందించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని ప్రశ్నించే విద్యార్థినిలపై హాస్టల్ వార్డెన్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. సరిపడా భోజనం పెట్టక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. హాస్టల్ లో విద్యార్థినీల సంఖ్య అనుగుణంగా గదులు లేవని, బాత్రూమ్ ల సమస్య ఉందని, హాస్టల్ త్రాగు నీటి సమస్య ఉందన్నారు. హాస్టల్ చుట్టూ ప్రహారీ గోడ లేక భయంగా నివసిస్తున్నారని ఆరోపించారు. హాస్టల్లో విద్యార్థినిలకు సరైన వసతులు కూడా లేవని.. ఈ విషయాన్ని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.హాస్టల్ లో నెలకొన్న సమస్యలపై హాస్టల్ వార్డెన్ దృష్టికి తీసుకెళ్తే అకారణంగా దుర్భాషలాడుతోందని విధ్యార్థినిలు ఆరోపించారు. తక్షణమే హాస్టల్ వార్డెన్ పై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న హాస్టల్ వార్డెన్ రంజిత అక్కడి చేరుకున్నారు. విద్యార్థి సంఘాలతో వాగ్వివాదానికి దిగారు. హాస్టల్ వార్డెన్ ను సస్పెండ్ చేయాలని జిల్లా ఉన్నతాధికారులను కోరారు. విషయం తెలుసుకున్న ఈడి ఎస్ సీ కార్పోరేషన్ అధికారిణి నిషిత విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏదైన సమస్యలుంటే నేరుగా ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం హాస్టల్ ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ స్టేట్ హాస్టల్ కన్వీనర్ రాజ్ కుమార్ ఏబీవీపీ నగర కార్యదర్శి పద్మశ్రీ, ఉపాధ్యక్షులు నరేష్ పటేల్, కళాశాల అద్యక్షుడు రఘువంశీ, ఉపాధ్యక్షులు తేజ, జిల్లా కార్యాలయ కార్యదర్శి నరేష్,సాయి హర్ష, మురళి, నరేంద్ర, మరియు హాస్టల్ విద్యార్థినీలు పాల్గొన్నారు.



# ఆలయానికి విరాళం అందజేత

గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 3 ( నమస్తే ఉదయం) కేటిదొడ్డి మండలంలోని వెంకటాపురంలో వెలసిన శ్రీ పాగుంట లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి ఆదివారం కర్ణాటక రాష్ట్రం రాయచూర్ కు చెందిన గోనెల గోవిందు రాములమ్మ కుటుంబ సభ్యులు ఆలయానికి తమ వంతు సహాయంగా అర తులం బంగారం ఆలయ నిర్వహణకు వారి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది వారి కుటుంబ సభ్యులకు ప్రత్యేక పూజలు చేయించి శాలువాతో సత్కరించారు ఈ కార్యక్రమంలో ఆలయ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరిస్తాం

### జిల్లా ఈడి కార్పోరేషన్ అధికారి నిషిత

గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 3 ( నమస్తే ఉదయం) వసతి గృహాల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు వసతి గృహాల్లో సమస్యలుంటే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జిల్లా ఈడి కార్పోరేషన్ అధికారి నిషిత అన్నారు. ఆదివారం గద్వాలలోని బీసి బాలికల వసతీ గృహంలో సమస్యలపై విద్యార్థినిలు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో ఆమె వసతీ గృహాన్ని చేరుకుని విద్యార్థినిల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హాస్టల్ లో పురుగుల అన్నం పెడుతున్నారని, సరిగా బాత్రూమ్ లు లేవని, సమస్యలను హాస్టల్ వార్డెన్ దృష్టికి తీసుకెళ్తే పట్టించుకోకుండా విద్యార్థినిలను హాస్టల్ వార్డెన్ దూషిస్తున్నట్లు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినిలు భోజనంలో పురుగులు వస్తున్నాయని బాత్రూమ్ లు సరిగా లేవని వసతి గృహాని, వర్కర్ లు విద్యార్థినిలతో పని చేయిస్తున్నారని ఆరోపించిన నేపథ్యంలో వసతిగృహాన్ని సందర్శించడం జరిగిందన్నారు. హాస్టల్ వార్డెన్ విద్యార్థినిలపై అజమాయిషీ చూపెడుతుందని, ఏ సమస్య ఆమె దృష్టికి తీసుకెళ్లిన నిర్లక్ష్య వైఖరి వ్యవహరిస్తున్నారని విద్యార్థినిలు తమ సమస్యలు వివరించారు. విధి నిర్వాహణలో బాధ్యతరహితంగా ప్రవర్తిస్తే వారిపై జిల్లా కలెక్టర్ కు నివేధిక సమర్పించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వసతీగృహాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తామని విద్యార్థినిలకు హామీ ఇచ్చారు.

# విద్యార్థుల మెరుగైన అభ్యాస ఫలితాలకై ఏఐ:

### కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

### ఏఐ ద్వారా...స్ఫూర్తి పథం

### విద్యార్థుల లక్ష్య నిర్ధారణకు...ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్ సాధనం

### మార్గదర్శిగా నిలిచే యత్నం



జనగామ, ఆగష్టు 03 ( నమస్తే ఉదయం): ప్రస్తుతం నడుస్తున్న సాంకేతిక యుగానికి తగ్గట్లుగా. విద్యారంగం కూడా మారాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం అలోచించి. విద్యారంగాన్ని ప్రక్షాళన చేసి. నేటి ఆధునిక కాలానికి తగ్గట్లు విద్యా ఉండాలని, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్సీ ని పరిచయం చేసిందని. దీనిని జిల్లాలోని అన్ని పాఠశాలల్లో పూర్తి స్థాయిలో ఉపయోగించుకునేలా. వివిధ కార్యక్రమాలను చేపడుతున్నట్టు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు. సాంప్రదాయ బోధన పద్ధతుల్లో.తరగతి గదిలో ఉన్న ప్రతి విద్యార్థికి ఒకే విధంగా బోధన ఉంటుంది. కానీ ప్రతి విద్యార్థి అభ్యాస శైలి వేరుగా ఉంటుందని... కొందరికి విజువల్ లెర్నింగ్ బాగా నచ్చుతుంటే, మరికొందరికి ఆడియో లేదా ప్రాక్టికల్ పద్ధతులు నచ్చుతాయన్నారు ఇలాంటి సమయంలో, ఏఐ ఆధారిత విద్యా. ప్రతి విద్యార్థికి ప్రత్యేకమైన అభ్యాస పద్ధతులను అందిస్తాయని,ఇవి వారి బలహీనతలు, శక్తిమంతమైన అంశాలను విశ్లేషించి, దానికి తగిన అభ్యాస మార్గాన్ని సూచిస్తాయన్నారు. కృత్రిమ మేధస్సు. మానవ మేధస్సును ప్రేరేపిస్తుందని, స్మార్ట్ కంటెంట్. సాంప్రదాయ బోధనా పద్ధతులను విప్లవాత్మకంగా మార్చడమే కాకుండా, మొత్తం అభ్యాస ప్రక్రియ ప్రాధాన్యత ను అలాగే ఇంటరాక్టివిటీని మరింత పెంచుతుందన్నారు. పాఠశాలల్లో తెలివైన ఏఐ సాంకేతికతను చేర్చడం వల్ల ఉపాధ్యాయులు, సమయం తీసుకునే పనులను ఆటోమేట్గా చేయడం ద్వారా విద్యార్థులు తమ కేరిర్ పైన దృష్టి పెట్టడానికి అవకాశం ఉంటుందన్నారు.గమ్యం లేని ప్రయాణం, లక్ష్యం లేని శ్రమ.అన్నీ వృథా %-% ఈ వాక్యం జీవిత సత్యాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. చదువులో చక్కటి తెలివితేటలు, ఏదైనా సాధించగల సామర్థ్యం ఉన్న విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో ఉన్నప్పటికీ, సరైన దిశ. నిర్దేశం లేకపోవడం వల్ల క్షేత్ర స్థాయి సందర్శన లకు వెళ్ళినప్పుడు, భవిష్యత్ లో మీరు ఏ కేరిర్ లో కొనసాగాలి అని అడిగినప్పుడల్లా, ఆ విద్యార్థులకు సరైన అవగాహన లేకపోవడం వల్ల తోచిన సమాధానాన్ని, తోటి విద్యార్థులు చెప్పిన లక్ష్యాన్నే, ఇతరులు చెప్పడం గమనించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ విద్యార్థుల జీవితాల్లోకి వెలుగుల మెరుపులు నింపే " స్ఫూర్తి పథం"అనే వినూత్న కార్యక్రమాన్ని శనివారం యశ్వంత్ పూర్ పాఠశాల నుంచి ప్రారంభించారు. నాలుగు మంచి మాటలు చెప్తే, అవి ఒక నాలుగు రోజులు మాత్రమే గుర్తు ఉంటాయని. కానీ ఒక దృశ్యాన్ని చూస్తే, అది మనసులో ఉండిపోతుందని భావించి,ఇందుకు ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్సీ ని ఎంపిక చేసి, దీని ద్వారా ఉపాధ్యాయులు విద్యార్థుల అంతర్గత శక్తులు, ఆసక్తులు, స్వభావ లక్షణాలను గుర్తించి, వారి బలాల ఆధారంగా తగిన లక్ష్యాన్ని నిర్ధారించేందుకు పునాది వేస్తారని కలెక్టర్ తెలిపారు. స్ఫూర్తి పథం కార్యక్రమం ద్వారా, విద్యార్థుల ఫోటోలను ఏఐ ద్వారా చాట్ జీపీటీ లో అప్లోడ్ చేసి,ఆ లక్ష్యానికి అనుగుణంగా దృశ్యాన్ని సృజనాత్మకంగా మలిచి, ప్రింటౌట్ తీసి తరగతి గదిలో అతికిస్తారన్నారు . ఈ ప్రక్రియ వల్ల విద్యార్థుల్లో ఒక దృఢ సంకల్పాన్ని, నిరంతర ప్రేరణను నెలకొల్పుతుందని. ప్రతి రోజు తమ లక్ష్యాన్ని ప్రతిబింబించే చిత్రాన్ని చూసే విద్యార్థి, క్రమంగా ఒక సానుకూల దృక్పథంతో, గమ్యాన్ని చేరేందుకు స్ఫూర్తిని, దిశను, ధైర్యాన్ని పొందుతారన్నారు. దీనిలో సాంకేతికత, ఉపాధ్యాయుల పలు దశల మార్గనిర్దేశనం సమన్వయం కావడం ఒక విశిష్టత అని.ఏం చదవాలో... ఎలా చదివితే... తమ కేరిర్ ఉన్నతంగా మారుతుందని విద్యార్థులు గ్రహించే అవకాశం ఉంటుందని,అప్పుడు పాఠశాల కు క్రమం తప్పకుండ వస్తారన్నారు. రోజురోజుకి ప్రభుత్వ పాఠశాలలో భోధన జిల్లా విద్యాశాఖ పక్షాన ఈ కార్యక్రమం విద్యార్థుల భవిష్యత్తు పట్ల నిబద్ధతను, చిత్తశుద్ధిని చాటిచెప్పుతోందని కలెక్టర్ పేర్కొన్నారు. స్ఫూర్తి పథం కేవలం విద్యా కార్యక్రమం కాదు, ఓ విద్యార్థి జీవిత మార్గదర్శకం! అని చెప్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్. తమ పిల్లల భవిష్యత్ కోసం ఇంతటి మంచి కార్యక్రమాన్ని ప్రారంభించినందుకు, జిల్లా కలెక్టర్ స్ఫూర్తి ప్రధాత గా నిలిచిపోతారని, విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషాన్ని వ్యక్త పరుస్తున్నారు.



# మద్దెలబండలో యజ్ఞం

మల్దకల్, ఆగస్టు 3 ( నమస్తే ఉదయం)మండల పరిధిలోని మద్దెలబండ గ్రామంలో ఆదివారం దయానంద విద్యా సమితి (ఆర్యసమాజ్)గద్వాల వారిచే శ్రీ శివ సీతారామాంజనేయ దేవాలయంలో శ్రావణ మాస సామూహిక యజ్ఞ కార్యక్రమంలో దేవయజ్ఞం నిర్వహించడమైనది. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు యజ్ఞ దంపతులుగా పాల్గొన్నారు.శ్రీ పుట్ట శ్రీనివాస్ ఆర్య ఈ క్రతువుకు బ్రహ్మత్వం వహించారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. “RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733